క్లుప్తంగా

జిల్లాలో మరో రెండు జీపీలు

మంథని: జిల్లాలో మరో రెండు కొత్త గ్రామ పంచాతీయతీలు ఏర్పడనున్నాయి. మంథని మండలంలోని లక్కేపూర్ పంచాయతీ పరిధి తోటగోపయ్యపల్లి, ముత్తారం మండలం ఖమ్మంపల్లి పంచాయతీ పరిధిలోని జిల్లల్లపల్లి గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసేందుకు గెజిట్ విడుదలైంది. జిల్లాలో మొత్తం 267 గ్రామ పంచాయతీలు ఉండగా కొత్త వాటితో ఆ సంఖ్య 269కి చేరనుంది.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం



గోదావరిఖని: సింగరేణి రామగుండం డివిజన్-2 ఏరియా నుంచి బదిలీపై వెళ్తున్న అధికారులను సోమవారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓసీపీ-3 ఎస్‌వోఎం డి.రమేశ్, స్టోర్స్ డీజీఎం కేవీ.రామకృష్ణారావులను జీఎం ఎల్వీ సూర్యనారాయణ శాలువాతో సన్మానించి, జ్ఞాపికలు అందించారు. అధికారులు ఎన్.వెంకటేశ్వర్‌రావు, మధుసూదన్, నర్సింహారావు, సంతోష్‌కుమార్, రాజేంద్రప్రసాద్, ఎర్రన్న పాల్గొన్నారు.

బారికేడ్ల ఏర్పాటు



పాలకుర్తి: బసంత్‌నగర్ ఠాణా పరిధిలోని ఫోర్ లేన్ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు సోమవారం ఎస్సై స్వామి ఆధ్వర్యంలో ధర్మారం క్రాస్‌రోడ్, జీడీనగర్ క్రాస్‌రోడ్, బసంత్‌నగర్ బస్టాండ్‌తోపాటు రహదారిపై మొత్తం పది చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేశారు.

కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలి

గోదావరిఖని: పర్మినెంట్ కార్మికులతో సమానంగా పని చేస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్జీ-2 డీజీఎం రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ వల్ల సింగరేణికి లాభాలు వస్తున్నాయని తెలిపారు. నాయకులు అశోక్, మల్లయ్య, మల్లేశ్, స్వరూప, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి బీసీ సదస్సుకు తరలిరావాలి

సుల్తానాబాద్: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎంబీ గార్డెన్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే బీసీ జిల్లా సదస్సుకు తరలిరావాలని మున్నూరు కాపు యూత్ రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ ఒక ప్రకటనలో కోరారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలు కుల సంఘాల నాయకులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఎలిగేడు: పెద్దపల్లిలో మంగళవారం నిర్వహించే బీసీ సదస్సుకు ఎలిగేడు మండలం నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కాసర్ల మహేందర్ కోరారు. సోమవారం ఎలిగేడులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉచిత వైద్యశిబిరం

కమాన్‌పూర్: గుండారం గ్రామంలో కమాన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్యులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు.

సంబురంగా రక్షాబంధన్



రాఖీ కడుతున్న సింగరేణి మహిళా ఉద్యోగులు



గోదావరిఖని గాంధీనగర్ ఆశ్రమంలో..

సుల్తానాబాద్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్‌కుమార్‌కు ఆయన సోదరీమణులు మౌనిక, మంజుల ఆవు పేడతో చేసిన రాఖీ కట్టారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని సురభి గోశాల నుంచి గోమయం గోపేడతో తయారు చేసిన ప్రత్యేక రాఖీలు తెప్పించినట్లు ఆమె తెలిపింది. గోమాతలో 33 వేల దేవతలు ఉంటారని, హిందువులకు ఆరాధ్య దైవమని పేర్కొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలో రాఖీ పండుగను ప్రజలు సంబురంగా జరుపుకున్నారు. సోదరీమణులు తమ అన్నాదమ్ములకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించారు.

గోదావరిఖని: సింగరేణి రామగుండం డివిజన్-3 పరిధిలోని ఓసీపీ-1లో రక్షాబంధన్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకుడు వైవీరావుతోపాటు అక్కడ పని చేస్తున్న ఉద్యోగులకు మహిళా ఉద్యోగులు రాఖీలు కట్టి, శుభాకాంక్షలు తెలిపారు.

గోదావరిఖనిటౌన్: స్థానిక గాంధీనగర్‌లోని ఎండీహెచ్‌డబ్ల్యూ నిస్సహాయుల పిల్లల ఆశ్రమంలో వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ, లైఫ్ స్టైల్ బ్యూటీ కేర్ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు నిర్వహించారు. పిల్లలకు చిన్నారి సహస్ర చేతులమీదుగా రాఖీలు కట్టించి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కల్వల సంజీవ్, శిరీష, సంస్థ నిర్వాహకులు సురభి శ్రీధర్, శ్రీలేఖ, ఆశ్రమ నిర్వాహకులు రాజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓదెల: మండలంలో రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. పుట్టింటికి చేరిన ఆడబిడ్డలు తమ సోదరులకు రాఖీ కట్టి, సంబరపడ్డారు.

కమాన్‌పూర్: మండలంలో రక్షాబంధన్ వేడుకలను సోమవారం సంబురంగా జరుపుకున్నారు. ఆడబిడ్డలు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించారు. అందరి ఇళ్లలో సందడి వాతావరణం నెలకొంది.

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14, 39వ డివిజన్లు, పాలకుర్తి మండలంలోని ఎల్కలపల్లి, గుంటూరుపల్లి, ఎల్కలపల్లి గేట్‌లో సోమవారం రాఖీ పౌర్ణమిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పద్మశాలీలు యజ్ఞోపవీతధారణ కార్యక్రమం నిర్వహించుకున్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం రక్షాబంధన్‌ను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించారు. అనంతరం కట్నకానుకలు స్వీకరించారు.

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లో రాఖీ సందడి నెలకొంది. ఆడబిడ్డలు తమ పుట్టింటికి చేరి, సోదరులకు రాఖీలు కట్టారు.

జూలపల్లి: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. అంతటా సందడి వాతావరణం కనిపించింది.



సుల్తానాబాద్‌లో ఆవు పేడతో తయారు చేసిన రాఖీ కడుతున్న సోదరి



ఫెర్టిలైజర్‌సిటీ: రాఖీలు కడుతున్న ఆడబిడ్డలు



రోడ్డు శిథిలం.. ప్రయాణం ప్రమాదకరం

రామగుండం: అంతర్గాం మండలంలోని రాయదండి–పెద్దంపేట గ్రామాల మధ్య రోడ్డు పూర్తిగా శిథిలమైంది. రాళ్లు తేలి, ప్రమాదకరంగా మారింది. దీంతో వానాకాలంలో బురద, గుంతల్లో నీరు నిలిచి, రాకపోకలకు వాహనదారులు, వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీరాజ్ అధికారులు స్పందించి, రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి ఎంఏ.అలీం, ఎంపీడీవో, అంతర్గాం, సెల్ : 92814 86443

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 97053 46608

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకుర్తి: పాముకాటుకు గురైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన శాత్రాజుల సతీశ్(39) ఆదివారం రాత్రి తన ఇంటి సమీపంలోని కిరాణా దుకాణానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా అతని కుడి కాలుపై పాము కాటు వేసింది. గమనించిన స్థానికులు ఆ పామును చంపి, బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే సతీశ్‌ను పెద్దపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కాల్వశ్రీరాంపూర్‌లో భక్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు



సుల్తానాబాద్ శివాలయంలో..



జూలపల్లి: కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి క్షీరాభిషేకం, రుద్రాభిషేకం జరిపారు. అనంతరం పూజారి మహేశ్‌కుమార్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఫెర్టిలైజర్‌సిటీ: రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫెర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. బిల్వార్చన చేశారు. గౌతమినగర్ శివాలయంలోని శివలింగాలకు భక్తులు క్షీరాభిషేకం జరిపారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు నిర్వహించారు. టెంకాయలు కొట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బ్రాహ్మణులకు దక్షిణ తాంబూలాలు అందించి, ఆశీర్వాదం తీసుకున్నారు. నిరుపేదలకు దానధర్మాలు చేశారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం కల్యాణ మండపం, అదనపు గదుల నిర్మాణానికి వేదపండితుడు కొండపాక శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భూమిపూజ, స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. మాజీ ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి దంపతులు హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పునర్మాణ దాత నల్ల మనోహర్‌రెడ్డి, అర్చకుడు ఉద్దండ నవీన్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు, మాజీ సర్పంచ్ పొట్టాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు. అనంతరం మందోట దుర్గామాత నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. పీఏసీఎస్ చైర్మన్ కొంజెర్ల వెంకటయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దండె వెంకటేశం, గ్రామస్తులున్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



సుల్తానాబాద్‌లో ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



రామగుండం: దాగురే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

పెద్దపల్లిరూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి రంగనాయక ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లను సోమవారం పెద్దపల్లిలో సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు కొమ్ము కరుణాకర్, కార్యదర్శి హనుమాండ్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: ఫొటోగ్రాఫర్లు తమ నైపుణ్యంతో కొన్ని గంటలు శ్రమిస్తేనే అద్భుతమైన ఫొటో చేతికి వస్తుందని లయన్స్ క్లబ్ జిల్లా కో-ఆర్డినేటర్లు వలస నీలయ్య, మాటేటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని పూసాల రోడ్డులో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఫొటోగ్రాఫర్లకు జ్ఞాపికలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. జాతీయ ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డు గ్రహీత గంధం రాజేశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు దీకొండ భూమేశ్ కుమార్, పిట్టల వెంకటేశం, రాయల్ల నవీన్, కోడూరి సతీశ్‌కుమార్, పూసాల రామకృష్ణ, బిట్ల రమేశ్, ఎల్లె రాజు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని స్థానిక ఫొటో అసోసియేషన్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ నాయకుడు పెద్దెల్లి ప్రకాశ్‌ను సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్, ప్రధాన కార్యదర్శి శనిగరపు మల్లేశ్, నాయకులు బండారి ప్రసాద్, ఎలగందుల శ్రీనివాస్, బైరం సతీశ్‌కుమార్, రామగిరి శ్రీనివాస్, తొగటి శ్రీధర్, కోడి రామకృష్ణ, చిప్ప కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ భవన్‌లో..

గోదావరిఖని లయన్స్ భవన్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్ దబ్బెట శంకర్‌ను రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు పి.మల్లికార్జున్, సెక్రటరీ వి.ఎల్లప్ప, సభ్యులు తిలక్ చక్రవర్తి, డాక్టర్ వెంకటేశ్వర్లు, పోకల ఆంజనేయులు, గుండ రాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్మారం: దాగురె చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

రామగుండం: పట్టణంలోని తబితా ఆశ్రమంలో రామగుండం, ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐ, అంతర్గాంకు చెందిన ఫొటోగ్రాఫర్లు 185వ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీని కనిపెట్టిన లూయిస్ డాగురే చిత్రపటానికి నివాళి అర్పించారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అర్షనపల్లి రాజు మాట్లాడుతూ.. తరాలు మారినా నాటి జ్ఞాపకాలను ఫొటోల్లో చూసుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. సంఘం ప్రతినిధులు గుమ్ముల నవీన్, మెండె శివశంకర్, బుర్ర వినయ్‌సాగర్, బదావత్ వేణు, కావలి నరేశ్, అబ్దుల్ మేహరాజ్, రాకేశ్, మోదుంపల్లి రామస్వామి, శంకరయ్య తదితరులున్నారు.

పాలకుర్తి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం బసంత్‌నగర్‌లో స్థానిక ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కోదండ రామాలయం ప్రాంగణంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మాదాసు భూమయ్య, పికిలింక శ్రీనివాస్, వైద్య నరేశ్, బొల్లు సాయిరాజ్, రామ్‌కుమార్, కాదాసి తిరుపతి, పోతుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ధర్మారం మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఎదుల్ల ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడు ముకుందరావు, కోశాధికారి బద్దపురి భూపతి, ప్రచార కార్యదర్శి చిరంజీవి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హైలెవల్ వంతెనలకు మోక్షమెప్పుడు?

- లోలెవల్ వంతెనలతో ఏటా వానాకాలంలో ఇబ్బందులు
- పదేళ్లుగా కార్యరూపం దాల్చని నిధుల మంజూరు
- భారీ వర్షం కురిస్తే రాకపోకలు బంద్
- జూలపల్లి మండల ప్రజల పరిస్థితి



జూలపల్లి వద్ద హుస్సేన్‌మియా వాగుపై లోలెవల్ వంతెన (ఫైల్)

జూలపల్లి: మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న హైలెవల్ వంతెనల నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. ప్రజాప్రతినిధులు నిధుల మంజూరుకు కృషి చేస్తామని చెప్పడమే కానీ కార్యరూపం దాల్చడం లేదు. దీంతో ఏటా వానాకాలంలో ఎక్కువ వర్షం పడితే తెలుకుంట–చీమలపేట మధ్య ఉన్న రామప్ప చెరువు అలుగు పారి, నీరు వంతెనపై నుంచి వెళ్తుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అలాగే, వడ్కాపూర్, ధూళికట్ట మధ్య జూలపల్లి వద్ద హుస్సేన్‌మియా వాగుపై లోలెవల్ వంతెనలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జూలపల్లి, వడ్కాపూర్ మధ్య కల్వర్టు శిథిలావస్థకు చేరింది. ఏ క్షణంలో కూలుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. జూలపల్లి మండల కేంద్రానికి వచ్చేవారు తప్పకుండా ఏదో ఒక వంతెనపైనుంచి రావాల్సిందే. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, హైలెవల్ వంతెనలు నిర్మించి, తమ బాధలు తీర్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినం

హైలెవల్ వంతెనల నిర్మాణ విషయమై అధికారులకు ఏళ్లుగా విన్నవిస్తున్నాం. నిధులు వస్తే కేటాయిస్తామని చెబుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినం. త్వరలోనే నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

– మంద లక్ష్మణ్, తెలుకుంట

వాగుపై వంతెన నిర్మించాలి

మండల కేంద్రానికి ప్రధానంగా వచ్చే దారిలోని హుస్సేన్‌మియా వాగుపై ఉన్న లోలెవల్ వంతెన వర్షాలకు నీటి మునిగి, రాకపోకలు నిలిచిపోతున్నాయి. హైలెవల్ వంతెన నిర్మించాలని పదేళ్లుగా కోరుతున్నాం. ఇప్పటికైనా నిర్మించాలి.

– అమరగాని శ్రీనివాస్, జూలపల్లి

యజ్ఞోపవీతధారణ, హోమం



యైటింక్లయిన్‌కాలనీ: యజ్ఞోపవీతధారణలో పద్మశాలీలు

గోదావరిఖనిటౌన్: స్థానిక మార్కండేయకాలనీలోని శ్రీ మార్కండేయ శివాలయంలో సోమవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలు, పద్మశాలీ కులస్తులు హోమం, యజ్ఞోపవీతధారణ నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు మంచికట్ల భిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో పద్మశాలీ సేవా సంఘం నాయకులు బండారి రాజమల్లు, బూర్ల దామోదర్, అనుమ రాజమల్లు, వంగ వీరస్వామి, కొండి లక్ష్మీపతి, జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం హనుమాన్ దేవాలయ ఆవరణలో నూలు పండుగ నిర్వహించారు. ఆలయ అర్చకుడు సుమంత్ వేదమంత్రోచ్ఛరణల మధ్య పద్మశాలీలు యజ్ఞోపవీతధారణ కార్యక్రమం జరుపుకున్నారు. పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు దేవనపల్లి చక్రపాణి, నాయకులు రాయమల్లు, శ్రీనివాస్, రాజేశ్, సత్యనారాయణ, ప్రభాకర్, లింగమూర్తి, బాపు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌హౌస్ కాలనీలో పిడుగుపాటు

గోదావరిఖని: పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని పవర్‌హౌస్‌కాలనీ శివాలయం సమీపంలో సోమవారం భారీ వర్షంతో పాటు పిడుగు పడింది. సింగరేణి టీటూ 97క్వార్టర్ ఆవరణలోని కొబ్బరిచెట్టుపై పిడుగు పడి మంటలు లేచాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పిడుగుపాటు శబ్దానికి సమీప ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899